APTEL /26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....



ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, సంపుటి : 1 సంచిక : 194 సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు పేజీలు : 8 శుక్రవారం 4 సెప్టెంబర్ 2026 వెల : 05/-

### అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు,

# కొత్త పింఛన్లు

- రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్
- స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి
- ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శ



సెప్టెంబర్ 3 : రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్

మిగతా 2వ పేజీలో..

### సోషల్ మీడియాలో జెన్ జీ క్రియాశీలకం.. అందుకు తగ్గట్టుగా

# సిద్ధమవ్వాలి



అమరావతి, సెప్టెంబర్ 3 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం ముగిసింది. ప్రధానంగా ఎల్‌నినోపైనే కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. మైనస్ 52 శాతంలో వర్షాలు నమోదయ్యాయని.. తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని, సీడ్ బాల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను కేబినెట్ ఆదేశించింది. పశుగ్రాసంపై దృష్టి పెట్టాలని కోరింది. కరవు పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం నుంచి ఏ విధంగా నిధులు రాబట్టాలనే అంశంపైనా మంత్రివర్గంలో చర్చించినట్లు తెలుస్తోంది. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీరు ఇవ్వడంపై ఆనందంగా ఉందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. సీఎం కేబినెట్‌లోకి రాగానే అందరూ లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలియజేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీరింగ్ అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు. మంత్రులందరూ ప్రజలలోకి వెళ్లాలని చెప్పారు. 'మనం ఇన్ని పనులు చేస్తున్నాం.. వీటన్నింటినీ ప్రజలకు చెప్పుకోవాలి. కొత్త జనరేషన్ జెన్ జీ అన్ని విషయాలపై అవగాహనతో ఉంది. వాళ్లు సోషల్ మీడియాలో క్రియాశీలకంగా ఉన్నారు. మనం కూడా అందుకు తగినట్టుగా సిద్ధమవ్వాలి. మనం చేస్తున్న మంచిని జెన్ జీ వద్దకు తీసుకువెళ్లాలి' అని సూచించారు. వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రులతో చంద్రబాబు అన్నారు. తప్పుడు, ఫేక్ ప్రచారాలు చేయడంలో వైసీపీ ముందు ఉంటుందని విమర్శించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు

2లో

### కాంగ్రెస్ లక్ష్మణ రేఖ దాటితే ఎవ్వరిపైనైనా

# చర్యలు ఉంటాయి



హైదరాబాద్, సెప్టెంబర్ 3 : కాంగ్రెస్ లక్ష్మణ రేఖ దాటితే ఎంతటి వారిపై అయినా చర్యలు ఉంటాయని తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ

మిగతా 2వ పేజీలో..

### నా బర్తరఫ్ కోసం అధిష్ఠానాన్ని రేవంత్

# బ్లాక్‌మెయిల్ చేశారు

- క్యాబినెట్ నుంచి బర్తరఫ్‌ను ధ్రువీకరించిన కొండా సురేఖ
- రేవంత్‌పై సురేఖ సంచలన ఆరోపణలు
- తన వివరణ తీసుకోలేదన్న సురేఖ



సెప్టెంబర్ 3 : మంత్రి పదవి నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సురేఖను తొలగించకపోతే తాను తప్పుకొంటానని అధిష్ఠానాన్ని రేవంత్ బెదిరించారని ఆమె వ్యాఖ్యానించారు. లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడకముందే.. తన బర్తరఫ్‌ను ఆమె ధ్రువీకరించారు. ఈ సందర్భంగా

2లో

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం ఖాయం

విజయవాడ, సెప్టెంబర్ 3 : స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయం ఖాయమని



విజయవాడ ఎంపీ, టీడీపీ నేత కేశినేని చిన్ని ధీమా వ్యక్తం చేశారు. ఈ మేయర్ ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమన్నారు. తాము 95 శాతంతో స్ట్రైక్ రేట్ చేయబోతున్నామని.. అందులో ఢోకా లేదని చెప్పారు. గురువారం విజయవాడలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విజయవాడలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని తెలిపారు. మన కలల రాజధాని అమరావతి, పోలవరం పూర్తి చేసుకుంటున్నామని చెప్పారు. యువతకి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా పని చేస్తున్నామని అన్నారు. ఇక్కడ మనకు పోటీ లేదని.. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అభ్యర్థులకు ఢోకానే లేదని ఆయన విశ్వాసం

2లో

### తెలంగాణ రైతాంగానికి

# నీళ్లు ఇవ్వరా?..

- కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ సూటి ప్రశ్న..



మిర్యాలగూడ, సెప్టెంబర్ 3 : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫోన్ చేస్తే ఆటోలో యూరియా వచ్చేదని, కాంగ్రెస్ పాలనలో మాత్రం యూరియా కోసం రైతులు తమ చెప్పులను లైన్లలో పెట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. నల్లగొండ జిల్లాకు దరిద్రాన్ని తెచ్చుకుని నెత్తిన పెట్టుకున్నామని.. రక్తం రుచి మరిగిన కాంగ్రెస్ రాక్షస పులిని తెచ్చుకున్నామంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మిర్యాలగూడలో కేటీఆర్ ఈరోజు (గురువారం) పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులపై తీవ్ర విమర్శలు గుప్పించారు. నాగార్జునసాగర్‌లో నీళ్లు

2లో

# చెన్నైలో 'ఒలింపిక్ సిటీ'.. ఫార్ములా-1 ట్రాక్.!

తమిళనాడు, సెప్టెంబర్ 3 : తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చెన్నై నగరాన్ని ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సెంటర్‌గా తీర్చిదిద్దే దిశగా ముందడుగు వేసింది. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలోని 110వ నిబంధన కింద ఒలింపిక్ సిటీని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం జోసెఫ్ విజయ్ ప్రకటించారు. రాష్ట్ర క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ ప్రాజెక్టులో ప్రపంచ స్థాయి క్రీడా వేదికలు, ఆధునిక శిక్షణ పరికరాలు, హై పర్ఫార్మెన్స్ ట్రైనింగ్ సెంటర్, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ కేంద్రాలు వంటివాటిని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా క్రీడాకారులు, కోచ్‌ల కోసం వసతి సదుపాయాలతో కూడిన సమగ్ర క్రీడా కేంద్రంగానూ చెన్నైని అభివృద్ధి చేయనున్నట్లు తెలుస్తోంది. దేశంలోకి ఫార్ములా వన్ రేసింగ్‌ను



2లో



### రాహుల్ పౌరసత్వ పిటిషన్

# కొట్టివేత

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరుడంటూ దాఖలైన పిటిషన్‌ను

మిగతా 2లో...

# పెనమలూరు అభివృద్ధికి మరో కీలక అడుగు

## -రు.2.80 కోట్లతో కాటూరు--మానికొండ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన



ఉయ్యూరు, సెప్టెంబర్ 3: పెనమలూరు నియోజకవర్గంలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ఉయ్యూరు మండలం కాటూరు గ్రామంలో రు.2.80 కోట్ల నిధులతో కాటూరు--మానికొండ రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల మధ్య రహదారి కనెక్టివిటీని మెరుగుపరచడమే లక్ష్యంగా దాదాపు రు.12 కోట్లతో వివిధ రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ముదునూరు--దూసరపాలెం రహదారి పనులకు శంకుస్థాపన చేశామని, త్వరలో కందలంపాడు--కుందేరు, మారేడుమాక--తెన్నేరు లింక్ రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అలాగే ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నిధులతో గ్రామాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, పెనమలూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు సి.య.ఆర్.ఎఫ్ ద్వారా రు.23 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఉయ్యూరు, తాడిగడప మున్సిపాలిటీల్లోనూ మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. పెనమలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేవ వరకు తమ ప్రయాణం ఆగదని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, వేమూరు శ్రీనివాసరావు, సజ్జా మధు, చీకుర్తి యుగబాబు, కాటూరు శరత్, ఆళ్ల శ్రీకాంత్, కోడే హరీష్, పాస్టర్ పి. మెతుషెల, కాటూరు రవి, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ వివరాలను నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రావెళ్ల వరుణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# పెనమలూరు ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్రంలో టాప్--10లో నిలవాలి ఎమ్మెల్యే బోడే ప్రసాద్

సెప్టెంబర్ 3,పెనమలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత పెంచి, పెనమలూరు నియోజకవర్గాన్ని విద్యా రంగంలో రాష్ట్రంలోనే నంబర్--1గా నిలపాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పిలుపునిచ్చారు. హెచ్‌ఎంలు, విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. పదో తరగతి ఫలితాలకు 7వ తరగతి నుంచే బలమైన పునాది వేయాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనలో సమస్యలు ఎదురైతే పోలీస్‌స్టేషన్‌కు పంపకుండా పాఠశాలలోనే కౌన్సిలింగ్ ఇవ్వాలని, అవసరమైతే తల్లిదండ్రులను పిలిపించి అవగాహన కల్పించాలని తెలిపారు. పోరంకి, వణుకూరు, ఈడుపుగల్లు, కంకిపాడు, గొడవర్రు తదితర పాఠశాలల్లో ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేసి, ఇప్పటి నుంచే సమష్టి కృషితో ఫలితాలను మెరుగుపరచాలని ఆదేశించారు. పెనమలూరు, పునాదిపాడు పాఠశాలల్లో కనిపిస్తున్న



ప్రణాళికాబద్ధమైన ఫలితాలను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సాధించాలని సూచించారు. పాఠశాలలను కేవలం భవనాలుగా కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని, ఉపాధ్యాయులు--హెచ్‌ఎంలు--విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తే పెనమలూరుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధ్యమని బోడే ప్రసాద్ అన్నారు. ఈ వివరాలను నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రావెళ్ల వరుణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# కాంగ్రెస్ లక్ష్మణ రేఖ దాటితే ఎవ్వరిపైనైనా చర్యలు ఉంటాయి

చైర్మన్ మల్లు రవి తేల్చి చెప్పారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై తీసుకున్న చర్యలే ఇందుకు ఉదాహరణ అని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ లైన్ దాటిన కొండా సురేఖ, చిన్నారెడ్డిని పదవుల నుంచి తొలగించారని చెప్పారు. దీనిపై ఇప్పటికే ఆలస్యంగా నిర్ణయం తీసుకున్నామని చాలా మంది తమను ప్రశ్నించినట్లు ఆయన చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్యయుతంగా సమస్యను పరిష్కరించాలనే ఆలస్యమైందని మల్లు రవి తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హయాంలో రాజయ్యను సమాచారం లేకుండానే ఉప ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించారని మల్లు రవి గుర్తు చేశారు. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై వచ్చిన ఆరోపణలతో క్రమశిక్షణా కమిటీ నివేదిక రూపొందించి కాంగ్రెస్ అధిష్ఠానానికి ఇచ్చిందన్నారు. ఇద్దరి వ్యాఖ్యలను పరిశీలించి సీరియస్ యాక్షన్ తీసుకోవాలని కోరినట్లు ఆయన చెప్పుకొచ్చారు. తెలంగాణ కాంగ్రెస్ కేడర్‌కు సందేశం వెళ్లేలా చర్యలు ఉండాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ రేఖ దాటితే ఎంతటి వారైనా చర్యలు ఉంటాయని తెలిసేలా ఏఐసీసీ చర్యలు తీసుకుందని రవి వివరించారు. కేసీ వేణుగోపాల్ విదేశాల్లో ఉండటంతో ఈ అంశంపై నిర్ణయం ఆలస్యమైందని మల్లు రవి తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రెండు సార్లు కలిసే అవకాశం ఇచ్చారని, దీంతో కొండా సురేఖ తన వాదనను అధిష్ఠానానికి చెప్పుకున్నారని పేర్కొన్నారు. వారి మధ్య ఏం చర్చలు జరిగాయో తెలియదని చెప్పారు. సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేసి చర్యలు తీసుకునే వ్యక్తి అయితే నేరుగా చర్యలు తీసుకునేవారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఆ విధానం ఉండదని, మంత్రి పదవి నుంచి తొలగించిన తర్వాత కొండా సురేఖ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే కూర్చుని మాట్లాడుకోవాలన్నారు. మరోవైపు, ముఖ్యమంత్రిపై తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను సురేఖ ఖండించలేదని మల్లు రవి మండిపడ్డారు. కొండా సురేఖపై తనకు ఫిర్యాదులు అందాయని, కోమటిరెడ్డి బ్రదర్స్‌పై ఫిర్యాదులు వస్తే వారిపైనా చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా కొండా సురేఖ, మురళీ, చిన్నారెడ్డికి తాను వ్యక్తిగతంగా వ్యతిరేకం కాదన్నారు. సురేఖ చేసిన తప్పుల ఆధారంగానే చర్యలు తీసుకున్నామన్నారు. కులాల ఆధారంగా పార్టీలో చర్యలు ఉండవని, కుట్ర అని ఆమె అనుకుంటే తానేమీ చేయలేనన్నారు. సీఎంను ఏమైనా అంటే ఖండించాల్సిన బాధ్యత కేబినెట్ మంత్రిపై ఉంటుందన్నారు. తన కూతురు చేసింది తప్పు అని ఖర్గే దగ్గర కూడా సురేఖ చెప్పలేదన్నారు.

పార్టీకి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే జిల్లా అధ్యక్షుడు, పీసీసీ అధ్యక్షుడు నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మల్లు రవి చెప్పారు. పార్టీ నేతలు, కార్యకర్తలను ఉత్సాహపరచడానికే రేవంత్ రెడ్డి.. టికెట్ల ప్రకటన, సీఎంగా తానే ఉంటానని చెప్పారన్నారు. దానిని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసమే ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారనే తప్పా సొంత ప్రయోజనాల కోసం కాదన్నారు. సీఎంగా ఎవరుండాలి.. టికెట్ ఎవరికి ఇవ్వాలనే దానిపై కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. కొండా సురేఖను మంత్రిగా తొలగించినా ఆమె పార్టీలోనే కొనసాగాలని కోరుకుంటున్నామని మల్లు రవి చెప్పుకొచ్చారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం ఖాయం

వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేసిన వారందరూ.. ఈసారి అదృష్టం వరిస్తుందని ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. మేయర్‌ని నేరుగా ప్రజలు ఎన్నుకునేలా సీఎం చంద్రబాబు నాయుడు ఓ చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్నారని తెలిపారు. డైరెక్ట్ మేయర్ ఎలక్షన్ అనేది సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోనే జరిగిందని అన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ ఓ మేయర్ పదవి సాధించుకుందంటే.. డైరెక్ట్ ఎలక్షన్ ద్వారానే అని ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని వివరించారు. ప్రజల్లో తమ పట్ల అభిమానం అధికంగా ఉంటుందని చెప్పారు. మొట్టమొదటి డైరెక్ట్ మేయర్ పంచుమర్తి అనురాధ అని గుర్తు చేశారు. టీడీపీ అభ్యర్థిగా విజయవాడలో భారీ మెజారిటీతో ఆమె గెలుపొందారని అన్నారు. ఆ తర్వాత కొంతమంది వ్యక్తులు వచ్చి తాము డైరెక్ట్‌గా గెలవలేమని చెప్పారని పేర్కొన్నారు. దీంతో మేయర్ ఎన్నికపై కార్పొరేషన్‌లో కార్పొరేటర్ల ద్వారా ఇన్‌డైరెక్ట్ ఎలక్షన్‌గా నిర్ణయించారని తెలిపారు. మళ్ళీ చంద్రబాబు నాయుడు.. ప్రజల అభిప్రాయం మేరకే మేయర్ అని ప్రకటించారని చెప్పారు. ఈ ఎన్నికల ద్వారా చక్కటి అభ్యర్థులు వస్తారని.. గజిబిజి, గందరగోళం లేకుండా చక్కగా ఎలక్షన్ కూడా జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు.. ఓ సాధారణ మహిళను ఎమ్మెల్సీగా తీసుకొచ్చారని చెప్పారు. టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి లోకేష్, కూటమి ఆధ్వర్యంలో, ఎవరైతే పార్టీ కోసం కష్టపడుతున్నారో, ఎవరికైతే ప్రజల్లో మంచి పేరుందో.. అటువంటి వారినే అభ్యర్థులుగా నిలబెడతామని తెలిపారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో ఇక్కడ ఎన్నికలు జరిగితే ఇబ్బంది వాతావరణం ఉంటుందన్నారు. నిజంగానే ఎలక్షన్లు దసరా సమయంలో ఉంటే, పోలీస్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ బిజీగా ఉంటారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిగణలోకి తోసుకోవాలని ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేశామన్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి కూడా సానుకూల స్పందన వస్తుందని భావిస్తున్నట్లు ఎంపీ కేశినేని చిన్ని చెప్పారు.

# తెలంగాణ రైతాంగానికి నీళ్లు ఇవ్వరా?.. కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ సూటి ప్రశ్న..

ఉన్నప్పటికీ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు శనిలా దాపురించారని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ రైతుల కళ్లల్లో నీళ్లు తెప్పించిన 'నీళ్ల మంత్రి' ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాద ఘటనపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలనూ కేటీఆర్ ప్రస్తావించారు. సొరంగంలో 'వాటర్‌లో నీళ్లు కలిశాయి' అంటూ మంత్రి మాట్లాడారని.. అసలు ఆయన 'క్వార్టర్‌లో నీళ్లు కలిశాయో ఏమో' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హుజూర్‌నగర్‌లో నీళ్ల కోసం రైతులు తమ బాధలు చెప్పుకుందామంటే వారిని గెదుముతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మంత్రి కోమటిరెడ్డి వ్యవహారం కూడా అందుకు భిన్నంగా లేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటే సీఎం రేవంత్ రెడ్డి భయ పడుతున్నారని, అందుకే తెలంగాణ నీళ్లు కిందికి పోతున్నా మాట్లాడటం లేదని ఆరోపించారు. రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. సెప్టెంబర్ 14న వినా యక చవితి లోపు రైతులకు నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అప్పటిలోగా నీళ్లు ఇవ్వకపోతే కోదాడ నుంచి హాలియా వరకు వేలాది మంది రైతులతో పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు. ఈనెల 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో రైతులకు నీళ్లు ఇవ్వాల్సిందేనని ప్రభుత్వాన్ని నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.

# చెన్నైలో 'ఒలింపిక్ సిటీ'.. ఫార్ములా-1 ట్రాక్.!

తిరిగి తీసుకురావడం సహా అంతర్జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించేలా అత్యుత్తమ శిక్షణ, సహాయక సదుపాయాలు కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. '2028 నాటికి భారత్‌లోకి ఎఫ్-1ను తిరిగి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం. ఇందుకోసం దేశంలో మోటార్ స్పోర్ట్స్‌ను పర్యవేక్షించి, మంత్రిత్వ శాఖకు నివేదిక సమర్పించేందుకు ఓ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటుచేశాం' అని యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ తెలిపింది. అదే సమయంలో చెన్నైలో ప్రత్యేకంగా మోటార్ స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేసి ఫార్ములా-1 నుంచి ఎఫ్-4 వరకు రేసులు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. భారత్‌లో 2030 నాటికి ఫార్ములా-1 రేస్, 2028 నాటికి వరల్డ్ ర్యాలీ ఛాంపియన్‌షిప్‌లో ఒక రౌండ్ సహా మోటోజీపీని నిర్వహించే దిశగా కేంద్రం చర్యలు చేపట్టినట్టు ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎమ్ఎస్‌సీఐ) ప్రెసిడెంట్ అరిందమ్ ఘోష్ ఇదివరకే వెల్లడించిన సంగతి తెలిసిందే.

# నా బర్తరఫ్ కోసం అధిష్ఠానాన్ని రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారు

టీవీ9తో మాట్లాడిన సురేఖ పలు కీలక విషయాలను వెల్లడించారు. తనను తొలగించే ముందు కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదని సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. తన వివరణ కూడా తీసుకోలేదని, రాజీనామా చేయాలని కూడా ఎవరూ చెప్పలేదన్నారు. అధిష్ఠానం నుంచి తనకు ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. తనతో మాట్లాడి వివరణ తీసుకుని ఉండాల్సిందని అన్నారు. తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి కుట్ర చేశారని సురేఖ ఆరోపించారు. అయితే తదుపరి కార్యాచరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. తాను తప్పు చేశాననే భావన లేదన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత మాట్లాడిన మాటలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. సుస్మిత స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని, ఆమె అభిప్రాయాలను తాము ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము మాట్లాడించలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిని చాలామంది విమర్శిస్తున్నా.. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో సీఎం ఆత్మపరిశీలన చేసుకోవాలని సురేఖ అన్నారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారిలో తామే ముందున్నామని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించింది రేవంత్‌రెడ్డినేనని చెప్పారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని సురేఖ స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై తమకు అభిమానం ఉందన్నారు. 2018లో కూడా ఇదే "దుష్టశక్తులు" తనకు టికెట్ రాకుండా అడ్డుకున్నాయని, అందుకే అప్పట్లో బీఆర్ఎస్ వైపు చూడాల్సి వచ్చిందని చెప్పారు. అన్ని విషయాలను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు వివరించినట్లు వెల్లడించారు.

# సోషల్ మీడియాలో జెన్ జీ క్రియాశీలకం.. అందుకు తగ్గట్టుగా సిద్ధమవ్వాలి

నీటి విడుదలపై కూడా వైసీపీ సిగ్గు లేకుండా దుష్ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్ట్ పూర్తైనా అది కూటమి ప్రభుత్వం చేసిందే అని.. ఈ విషయం ప్రజలు కూడా గమనిస్తున్నారని తెలిపారు.

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను కూడా అదుపు చేయాలన్నారు. దీనిపై ఉన్న కేబినెట్ సబ్ కమిటీ ధరలపై జాగ్రత్తగా ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు. మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు ధరల పెరుగుదలపై దృష్టి సారించాలని సీఎం చంద్రబాబు కోరారు.

# రాహుల్ పౌరసత్వ పిటిషన్ కొట్టివేత

అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. పిటిషనర్ తన ఆరోపణలకు తగిన ఆధారాలను కోర్టుకు సమర్పించలేకపోయారంటూ లఖ్‌నవ్ బెంచ్ పేర్కొంది. రాహుల్ గాంధీ బ్రిటన్‌లో ఓ కంపెనీని పెట్టారని, ఆ సందర్భంగా తనను తాను ఆయన బ్రిటిష్ పౌరుడినంటూ ప్రకటించుకున్నారని.. ఈ మేరకు ఆయనకు ఉన్న భారత పౌరసత్వాన్ని, ఎంపీ పదవిని రద్దు చేయాలంటూ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే రాహుల్‌పై ఆరోపణలకు సంబంధించిన అంశం ఇప్పటికే కేంద్రం వద్ద పరిశీలనలో ఉంది.

# ఐపీఎస్ అధికారులు విశాల్ గున్ని, కాంతి రాణా టాటా లపై సస్పెన్షన్ ఎత్తివేత

అమరావతి, సెప్టెంబర్ 3, నేటి శుభోదయ : సీనియర్ ఐపీఎస్ అధికారులు విశాల్ గున్ని (2010 బ్యాచ్), కాంతి రాణా టాటా (2004 బ్యాచ్) లపై ఉన్న సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. వారిని తక్షణమే విధుల్లోకి తీసుకుంటూ గురువారం సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అఖిల భారత సర్వీసుల క్రమశిక్షణ, అప్పీల్ నిబంధనల ప్రకారం విశాల్ గున్ని, కాంతి రాణా టాటాలను ప్రభుత్వం గతంలో సస్పెండ్ చేసింది. అనంతరం వారి సస్పెన్షన్‌ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పొడిగిస్తూ వచ్చింది. తాజాగా వీరిద్దరి సస్పెన్షన్ సెప్టెంబర్ 4 వరకు అమల్లో ఉంది. ఇద్దరు అధికారుల సస్పెన్షన్ ఎత్తివేతకు సంబంధించి డీజీపీ (హెచ్‌ఓపీఎఫ్) ఇచ్చిన నివేదికలను ప్రభుత్వం పరిశీలించింది. కాంతి రాణా టాటా ఆగస్టు 24న సమర్పించిన వినతిపత్రాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నిర్ణయించింది. దీంతో విశాల్ గున్ని, కాంతి రాణా టాటాలను తక్షణమే విధుల్లోకి పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, వారిపై కొనసాగుతున్న క్రమశిక్షణ, క్రిమినల్ కేసులపై ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ పేరుతో ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇద్దరు అధికారులకు ఉత్తర్వుల ప్రతులను అందజేసి, వారి నుంచి రసీదు తీసుకోవాలని డీజీపీకి ప్రభుత్వం ఆదేశించింది.

# నేడు నాగవరప్పాడు దాసంజనేయ దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



గుడివాడ, సెప్టెంబర్ 3 నేటి శుభోదయ : ప్రభోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక గుడివాడ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నాగవరప్పాడు వంతెన వద్ద ఉన్న ష్టి దాసంజనేయ స్వామి దేవస్థానం పక్కన నిర్వహించనున్నట్టు నిర్వాహకులు రావులకొల్లు వెంకటమల్లేశ్వరరావు తెలిపారు.శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. 11వ తేదీన ఊరు ఎరిగింపు నిర్వహిస్తామని చెప్పారు. వారం రోజుల పాటు జరిగే వేడుకలలో శ్రీకృష్ణుని జ్ఞానసందేశాలు ఇస్తారని తెలిపారు.

# గుడివాడ అర్బన్ బ్యాంకు కంప్యూటర్లలో మాల్ వేర్

## -సైబర్ నేరగాళ్లు హ్యాకింగ్ చేశారని అనుమానం...ఆర్బీఐకు ఫిర్యాదు




గుడివాడ, సెప్టెంబర్ 3 నేటి శుభోదయ : గుడివాడ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్లో కంప్యూటర్లకు సైబర్ నేరగాళ్లు మాల్వేర్ను పంపి హ్యాకింగ్ చేసినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.దీంతో సిబ్బంది, అధికారులు వెంటనే అప్రమత్తమై నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారు. బ్యాంకులో ఎలాంటి ఆర్థిక నష్టం జరిగిన దాఖలాలు కనిపించలేదని అధికారులు చెబుతున్నారు. 1వ తేదీన బస్టాండు ముందున్న బ్యాంకును తెరిచిన గంట వరకూ అన్ని లావాదేవీలు బాగానే జరిగాయి. ఆ తర్వాత 11 గంటల నుంచి కంప్యూటర్లు మొరాయిస్తుండటంతో సిబ్బంది ఒక్కసారిగా ఉలి క్కిపడ్డారు. దీంతో వెంటనే సిస్టమ్స్ పరిశీలించగా వైరస్తో కూడిన మాల్వేర్ను గుర్తించారు. వెంటనే సాఫ్ట్వేర్ సర్వీస్ ప్రొవైడ్ చేసిన ఏజన్సీ వారికి ఫోన్ చేసి, లావాదేవీలు నిలిపేశారు. మంగళవారం అర్థరాత్రి వరకూ పరిశీలించి ప్రధాన సర్వర్ లో మాల్ వేర్ ను కనుగొని బుధ వారం ఉదయానికి బ్యాంకు ప్రధాన బ్రాంచిలోని 4 కంప్యూటర్లను సరిచేసి పనిచేసేలా చర్యలు చేపట్టారు. దీంతో బుధవారం ఉమ్మడి కృష్ణా జిల్లాలోని గుడివాడ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 6 బ్రాంచీలు, గుడివాడలోని ప్రధాన బ్రాంచి కార్యాలయంలో లావాదేవీలను కొనసాగించారు.

**ఫోరెన్సిక్ ఆడిట్కు సిఫారసు : జిల్లా సహకార అధికారి చంద్రశేఖరరెడ్డి**

ది గుడివాడ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో కంప్యూటర్లు మొరాయించి లావాదేవీలు నిలి చిన సంగతిపై ఆర్బీఐకు ఫిర్యాదు చేయగా ఫోరెన్సిక్ ఆడిట్కు సిఫారసు చేశారు. బ్యాంకు ఖాతాదారులకు ఎలాంటి సమస్య లేదని, భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు.

# ఆర్డిటి సంస్థ చైర్మన్ ఫెర్రర్ ను కలిసిన ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంత పురం సెప్టెంబర్ 03 నేటి శుభోదయ : రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దివంగత కీర్తిశేషులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ సతీమణి అన్నే ఫెర్రర్ ను వారి కుమారుడు రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ చైర్మన్ మాంచో ఫెర్రర్ ని అనంతపురం నగరంలోని ఆర్డిటి కార్యాలయం లో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాప్తాడు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ డి టి సంస్థ నిర్వహిస్తున్న విద్య, వైద్యం వెనుకబడిన వర్గాల కోసం చేస్తున్న అభివృద్ధి సంక్షేమం గురించి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఫెర్రర్ తో మాట్లాడారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలోనే కాకుండా కడప, కర్నూలు, చిత్తూరు పాటు తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్నగర్, కరీంనగర్, శ్రీశైలం తదితర ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్డిటి చైర్మన్ మంచో ఫెర్రర్ , రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఆయన వివరించారు. ఆర్డిటి చైర్మన్‌ను కలిసినవారిలో పరిటాల సునీత సోదరుడు బాలాజీ, పరంధామ యాదవ్ తదితరులు ఉన్నారు.



# పేదరికం నుంచి ఎదిగేందుకు పి .4 ద్వారా మార్గం చూపుతున్న విజనరీ సీఎం చంద్రబాబు

**- ఎమ్మెల్యే వెనిగండ్ల రాము -గుడ్లవల్లేరులో పి 4 'ఫ్రీ గ్రౌండ్ మీటింగ్**

**-ఆరు బంగారు కుటుంబాలకు,అసెట్స్ డిస్ట్రిబ్యూషన్' చేసిన ఎమ్మెల్యే రాము**

**-వందలాది కుటుంబాల ఉన్నతికి సహాయం అందిస్తున్న మేఘా కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు**






గుడ్లవల్లేరు, సెప్టెంబర్ 3 నేటి శుభోదయ : పి - 4 ద్వారా కేవలం సహాయం అందించడమే కాకుండా, కుటుంబం తన కాళ్లపై తాను నిలబడేలా చేయడమే అసలు ఉద్దేశం అన్నారు.పేదరికం నుంచి ఎదిగేందుకు పి .4 ద్వారా మార్గం చూపుతున్న గొప్ప విజనరీ సీఎం చంద్రబాబు అని ఆయన కొనియాడారు. గుడ్లవల్లేరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పి-4 ప్రాజెక్టులో భాగంగా 'ఫ్రీ గ్రౌండ్ మీటింగ్ విత్ బంగారు కుటుంబాలు, అసెట్స్ డిస్ట్రిబ్యూషన్' కార్యక్రమాన్ని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నేతృత్వంలో గురువారం నిర్వహించారు. పి-4 ఆరో దశలో భాగంగా రూ.66 లక్షల వ్యయంతో 115 కుటుంబాలకు లబ్ధి చేకూరేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా ఆరు బంగారు కుటుంబాలకు వారి నైపుణ్యాలకు అనుగుణంగా స్వయం ఉపాధి పొందేందుకు ఆటోలు, వివిధ రకాల యంత్ర సామగ్రిని ఎమ్మెల్యే రాము అధికారులు, కూటమి నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన ఎమ్మెల్యే దాతలు అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి-4 సమావేశంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ సమాజంలో మొదటి అడుగు ఎప్పుడూ కష్టంగానే ఉంటుందని, దారిలేని ప్రాంతంలో పడే మొదటి అడుగే భవిష్యత్ తరాలకు మార్గాన్ని చూపుతుందని అన్నారు. అలాంటి తొలి అడుగు వేస్తూ రాష్ట్రానికి మార్గదర్శకత్వం వహిస్తున్న గొప్ప విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రపంచంలోనే వినూత్నంగా పి-4 కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. సమాజంలోని ఉన్నత వర్గాలను దాతలుగా ఏకీకృతం చేసి అవసరమైన పేద కుటుంబాలకు సహాయం అందించే విధంగా ఒక వ్యవస్థను రూపొందించడం అభినందనీయమన్నారు."నైపుణ్యం ఉన్నప్పటికీ ఏం చేయాలో, ఎలా ముందుకు వెళ్లాలో తెలియక చాలామంది పేదరికంలోనే ఉ ండిపోతున్నారు. అలాంటి కుటుంబాలకు పి-4 కార్యక్రమం ఒక మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కేవలం ఉపాధి సాధనాలు అందించడమే కాకుండా వారు, తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే పి-4 లక్ష్యం అన్నారు. ఒక కుటుంబం అభివృద్ధి చెందితే ఆ కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుంది" అని అన్నారు. గుడ్లవల్లేరు ప్రాంతానికి చెందిన మేఘా సంస్థ అధినేతలు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. మేఘా కృష్ణారెడ్డి కోట్లాది రూపాయలతో మండల అభివృద్ధికి సహకారం అందించడంతో పాటు పి-4 ద్వారా వందలాది కుటుంబాలకు ఉపాధి మార్గాలు చూపుతున్నారని, ఇందుకు ప్రభుత్వం, ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. చారిటీ పేరుతో ఆర్థిక సహాయం అందించి వదిలేయకుండా.. చంద్రబాబు నాయుడు కల్పించిన అవకాశాన్ని మేఘా సంస్థ సద్వినియోగం చేసుకుంటూ కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడం అభినందనీయమన్నారు. "సహాయం తీసుకున్న కుటుంబం రేపు మరో కుటుంబానికి సహాయం చేసే స్థాయికి ఎదగాలనీ,అదే పి-4 కార్యక్రమం అసలు ఉద్దేశం" అని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. దాతలు అందిస్తున్న సహాయం నిజంగా అవసరమైన వారికి చేరేలా అధికారులు, పి-4 బృందం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లబ్ధిదారుల నైపుణ్యాలను గుర్తించి.. వారికి అనుగుణంగా పశువులు, ఆటోలు, యంత్ర సామగ్రి వంటి ఉపాధి సాధనాలను అందించడం ద్వారా స్థిరమైన ఆదాయ మార్గాలను కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి,ఎంపీడీవో ఇమ్రాన్, స్పెషలాఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, పి -4 ప్రాజెక్టు మేనేజర్ చింతయ్య, మండల టిడిపి అధ్యక్షుడు పోలవరపు వెంకట్రావు, శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ ఈడే మోహన్, టిడిపి నాయకులు కొడాలి రామరాజు, పి.ఫోర్ సభ్యులు, మెగా సంస్థ ప్రతినిధులు, బంగారు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులలో నైతిక విలువలు పెంచుదాం

## -డాక్టర్ వడ్లమూడి జయచంద్ర





మచిలీపట్నం, ఆగస్టు 3 నేటి శుభోదయ : పిల్లలను ప్రాథమిక పాఠశాల దశ నుండి నైతిక విలువలతో పెంచాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ వడ్లమూడి జయచంద్ర అన్నారు. గురువారం వేమూరి వెంకటసుబ్బయ్య, కుదరవల్లి సీతారామయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలోబ్రిగేడ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో నిర్వహించిన నోట్ పుస్తకాల పంపిణి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ఉత్తమ సమాజం కోసం విద్యార్థులు పునాదిరాళ్లని అన్నారు.

విద్యార్థులలో విలువలు పెంచడంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు సమైక్యంగా కృషి చేయాలని అన్నారు. ట్రస్ట్ కన్వీనర్ వేమూరి వెంకట రమేష్ మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా మచిలీపట్నం పరిసర ప్రాంతాలలో నిరుపేదల పిల్లలు చదువుకునే పాఠశాలలను గుర్తించి వారికి చేయూతనందిస్తున్నామని తెలియజేశారు. మచిలీపట్నం ద్వారా తమ సంస్థలకు గుర్తింపు వచ్చిందని అందుకు తిరిగి మచిలీపట్నానికి సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ప్రముఖ న్యాయవాది మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకి శెట్టి బాలాజీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తమ సంపాదనలో కొంత సమాజానికి అందించాలని అన్నారు. విద్యార్థి దశనుండే సేవా తత్పరత నేర్పించాలని సూచించారు. వెలుగు ఫౌండేషన్ అధినేత చందమామ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు అందుబాటులో ఉన్న ప్రాంతాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, పకృతి పర్యావరణకు కృషి చేయాలని అన్నారు. వెలుగు ఫౌండేషన్ ద్వారా మృతించిన వెంగళ వెంకయ్య క్యాలెండర్ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాగంటి రమణ, మాటూరి రాజేష్, లంకి శెట్టి హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు. రాబోయే ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని వేమూరి రమేష్ ఉపాధ్యాయులు అందరికీ పెన్నులు పంపిణీ చేశారు.

# నా రాజకీయ ప్రవేశానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే బలరామకృష్ణ దంపతులు ఆదర్శం...!

### – జనసేన పార్టీ వీర మహిళ, నిడిగట్ల గ్రామ మహిళా సంఘాల నాయకురాలు శ్రీమతి మేడిశెట్టి పద్మశ్రీ శివరామ్..!





కోరుకొండ, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె) :జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, ఆదర్శాలు తోపాటు మా అభిమాన రాజకీయ గురువు, మార్గదర్శి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతుల ఆదర్శం, ప్రోత్సాహం తోనే తాను రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్నానని జనసేన జిల్లా కార్యదర్శి మేడిశెట్టి శివరాం సతీమణి, జనసేన పార్టీ వీర మహిళ శ్రీమతి మేడిశెట్టి పద్మశ్రీ శివరామ్ అన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తమ గ్రామం నిడిగట్ల పంచాయితీకి గత 15 సంవత్సరాలుగా ఎన్నికలు నిలిచిపోయాయని గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటి సమస్యల పరిష్కారం కొరకు తాను సర్పంచ్ గా ఎన్నికల బరిలో నిలవడానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సహకారంతో ముందుకు వస్తున్నానని ఆమె తెలిపారు. ఇప్పటి వరకు ఎన్నికలు జరగకపోవడంతో ప్రణాళికా సంఘం నిధులు ఆగిపోవడం కారణంగా గ్రామంలో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గ్రామంలో ఇంటింటికి తాను తిరిగినప్పుడు అనేక సమస్యలను ప్రజలు ప్రస్తావించారని, వాటిని పరిష్కరించాలి అంటే ఎన్నికలు జరగాలి అని పద్మశ్రీ పేర్కొన్నారు. నిడిగట్లకు ఎన్నికలు జరుగుతాయి అన్న విషయం తెలిసిన వెంటనే అనేకమంది తనకు ఫోన్ చేసి అభినందించారని, అలాంటి అవకాశం వస్తే దేవుడి దయ వల్ల, ఎమ్మెల్యే బలరామకృష్ణ దయవలన తాను గ్రామ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

తాను ఎన్నికలలో విజయం సాధిస్తే గ్రామ సమస్యలు పరిష్కారానికి కృషిచేసి తన మామగారు స్వర్గీయ మేడిశెట్టి సుబ్బరాం పేరు నిలబడతానని నిడిగట్ల గ్రామస్తులకు పద్మశ్రీ హామీ ఇస్తున్నారు. ఆయన సుమారు 20 ఏళ్ల పాటు గ్రామ సర్పంచ్ గా పనిచేసి.. గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేసి, జిల్లా వ్యాప్తంగా మంచి గుర్తింపును, గౌరవాన్ని పొందారని ఈ సందర్భంగా శ్రీమతి పద్మశ్రీ గుర్తు చేశారు. కాగా ఆమె తీసుకున్న నిర్ణయానికి గ్రామంలో మహిళలు, యువకులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు పార్టీలకు అతీతంగా మద్దతు తెలుపుతున్నారు.

# 'దాతలారా దయ చూపండి..!!'

### - బ్లడ్ బోన్ క్యాన్సర్లతో బాధపడుతున్న తెలుగుదేశం మహిళా కార్యకర్త..
### - బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు రూ. 25 వేలు సహాయం పట్ల కృతజ్ఞతలు.
### - మానవహక్కుల సంఘం ఆంధ్ర తెలంగాణ చైర్పర్సన్ ఖండవల్లి లక్ష్మీ విజ్ఞప్తి





కోరుకొండ, సెప్టెంబర్ 3, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె) : తెలుగుదేశం పార్టీలో ఎంతోకాలంగా కష్టపడి పనిచేసిన దివాన్ చెరువు గ్రామం బాబు నగర్ కి చెందిన దళిత మహిళ కార్యకర్త ములపర్తి ఎస్తేరు రాణి, బోను క్యాన్సర్, బ్లడ్ క్యాన్సర్ల తో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుందని, మానవ హక్కుల పరిరక్షణ సంఘం ఆంధ్ర తెలంగాణ చైర్పర్సన్ ఖండవల్లి లక్ష్మి తెలిపారు, నిరుపేద కుటుంబానికి చెందిన ఎస్తేరు రాణి కి మెరుగైన వైద్యం అవసరం ఏర్పడిందని దాతలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రభుత్వం దయ చూపి ఆర్థిక సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలో అలుపెరగనిగా శ్రమిస్తూ పార్టీ బలోపేతానికి కష్టపడిందని అన్నారు. రెండు సంవత్సరాల క్రితం భయంకరమైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుందని నిరుపేదరాలైన దళిత మహిళ ను అనారోగ్య పరిస్థితిలో ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికారములో ఉన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రభుత్వం ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద ప్రజల సమస్యలు తెలుసుకోవాలని వారిని ఆదుకోవాలని ఇస్తున్న పిలుపుకు పార్టీ నాయకులు స్పందించాలని అన్నారు. క్యాన్సర్ వ్యాధి తీవ్ర దిశలో ఉందని స్కానింగ్ మెరుగైన చికిత్స కోసం మరో 50 వేల రూపాయలు అవసరమని వైద్య వర్గాలు చెబుతున్నాయని ఖండవల్లి లక్ష్మి తెలిపారు. ప్రస్తుతం అనారోగ్య పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని ప్రభుత్వం తక్షణం పెన్షన్ మంజూరు చేయాలని గత ప్రభుత్వం తెలుగుదేశం వ్యక్తులుగా భావించి నిలిపివేసిందని అన్నారు. బిజెపి నాయకులు విశ్వహిందూ పరిషత్ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు 25,000 ఆర్థిక సహాయం చేశారని ఆ మొత్తం తో పాటు తాను మరొక ఐదు వేలు కలిపి 30 వేల రూపాయలు ను గురువారం బాధితురాలి కు అందజేశారు. కష్టాల్లో ఉన్న అనారోగ్య మహిళకు 25,000 సహాయం చేసిన కంబాల శ్రీనివాస్ కు ఖండవల్లి లక్ష్మితోపాటు బాధితురాలు మరియమ్మ ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయి ఆశ, సత్యవతి, జ్యోతి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# దళిత యువకుడి హత్యపై నిందితులను శిక్షించాలి



జమ్మలమడుగు, సెప్టెంబర్ 3: గుంటూరు జిల్లా కొన్నికల్లు గ్రామానికి చెందిన చీకటి గోపిని చంపిన వారిని కఠినంగా శిక్షించాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. మైదుకూరులో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో మాలలపై హత్యలు,అత్యాచారాలు పెరిగాయని,వాటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గోపి మృతిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ సంక్షేమ పథకాలైన 27 పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

# పవన్ కళ్యాణ్ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో జీవించాలని తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించి, పూజలు జరిపిన వీరాభిమాని ముక్కా రాంబాబు..!



కోరుకొండ, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె) :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించి కోరుకొండ మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షులు ముక్కా రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్కి ఆయురారోగ్య ఐశ్వర్యాలతో నిండు నూరేళ్ళు ఆనందంగా జీవించాలని, రాష్ట్ర మరియు దేశ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని,ఆయన ముఖ్యమంత్రి అయి ప్రజలకు మరింత చేరువ కావాలని కోరుకుంటున్నట్లు రాంబాబు తెలియజేసారు. అలాగే రాజానగరం శాసనసభ్యులు, తమ రాజకీయ గురువు బత్తుల బలరామకృష్ణ మంత్రి పదవినీ అలకరించాలని, ప్రజలందరూ బాగుండాలని మనస్ఫూర్తిగా శ్రీవారిని దర్శించుకునీ కొరుకోవడం జరిగిందని ఆయన బుధవారం మీడియాకు తెలియజేసారు.

# న్యూ బ్రిడ్జి అండర్‌పాస్‌ను సుందరీకరించాలి

### వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 3 (నేటి శుభోదయం): న్యూ బ్రిడ్జి అండర్‌పాస్‌ను సుందరీకరించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరంలో తన పర్యటనలో భాగంగా లబ్బీపేట, రామలింగేశ్వరనగర్, కృష్ణలంక, రాణిగారి తోట తదితర ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ క్షేత్రస్థాయిలో వివిధ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా న్యూ బ్రిడ్జి వద్ద ఉన్న అండర్‌పాస్‌ను పరిశీలించిన కమిషనర్, అక్కడ పేరుకుపోయిన డెబ్రిస్‌ను పూర్తిగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. అండర్‌పాస్ గోడలకు ఆకర్షణీయమైన వాల్ పెయింటింగ్స్ వేయడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కలిగేలా అండర్‌పాస్‌ను సుందరీకరించి, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం రామలింగేశ్వరనగర్‌లోని సాయిరాం కట్‌పీసెస్ ప్రాంతం చివర కృష్ణానది వద్ద ఏర్పాటు చేసిన మోటార్ పంపులను కమిషనర్ పరిశీలించారు. వర్షాలు కురిసే సమయంలో నివాస ప్రాంతాల్లోకి నీరు చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, మోటార్ పంపులను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు చేరిన వెంటనే పంపుల ద్వారా నీటిని బయటకు తరలించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాణిగారి తోట ప్రాంతంలో పర్యటించిన కమిషనర్ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. అన్నా క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహారం నాణ్యత ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆహారం నాణ్యత, రుచి, పరిశుభ్రతతో పాటు అక్కడ అందుతున్న సౌకర్యాలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకోగా, క్యాంటీన్‌లో అందుతున్న ఆహారం నాణ్యతతో పాటు అన్ని సౌకర్యాలు బాగున్నాయని, తాము సంతృప్తిగా ఉన్నామని ప్రజలు కమిషనర్‌కు తెలిపారు.ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇన్‌చార్జ్ రామారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ పి. మోహన్ బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగుల పెన్‌డౌన్ కార్యక్రమానికి ఏపీ ఎం ఎల్ టి ఆఫ్ అసోసియేషన్ సంఘీభావం




అనంత పురం సెప్టెంబర్ 03 నేటి శుభోదయ : మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జే ఏ సి ఆధ్వర్యంలో చేపట్టిన పెన్ డౌన్ కార్యక్ర మంలో భాగంగా అనంతపురంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో మానవహారం కార్యక్రమం నిర్వహించారు. కాంట్రాక్ట్ జే ఏ సి చైర్మన్ దిన్నె శరత్ బాబు, కో–చైర్మన్ టి వెంకటనారాయణ, కన్వీనర్ పి లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటించి, కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని వివిధ పి హెచ్ సి, జీ జి హెచ్ ఎస్, ఎస్ ఎస్ హెచ్,ల్యాబ్ టెక్నిషియన్స్ జీ జి హెచ్ సూపర్ స్పెషాలిటీ,హాస్పిటల్ స్టాఫ్ నర్సులు ఫార్మాసిస్ట్ లు ఉద్యోగులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఏ పి ఎం ఎల్ టి ఏపీ ఎం ఎల్ టీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులు అందిస్తున్న సేవలు అత్యంత కీలకమైనవని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న కార్యక్రమాలకు ఏ పి ఎం ఎల్ టి అసోసియేషన్ సంపూర్ణ సంఘీభావం మద్దతు ఉంటుందని ప్రతినిధులు తెలిపారు.ఆర్ శ్రీనివాసులు : ఏపీ ఎం ఎల్ టిరాష్ట్ర ఉపాధ్యక్షులు

జఫ్రుల్లా :రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వేణుగోపాల్ :

సుదర్శన్ శర్మ : ఏపీ ఎం ఎల్ టి ఆర్గనైజింగ్ సెక్రటరీ

రామమోహన్ : ఏ పి ఎం ఎల్ టి ఆర్గనైజింగ్ సెక్రటరీ

మధుబాబు : కార్యవర్గ సభ్యులు

శ్రీనివాస రెడ్డి : జిల్లా ఎన్ హెచ్ అధ్యక్షులు

అనంతపురం జిల్లా ఏ పి జి సి ఎన్ ఏ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంతి,అనంతపురం జిల్లా మెడికల్ డకాంట్రాక్టు జేఏసీ ఆర్గనైసింగ్ సెక్రటరీ బి హేమలత, శివ కృష్ణ, వన్నూరు వలి, వైస్ ప్రెసిడెంట్ ఉపేంద్ర, రాజగోపాల్. మహబూబ్ బాషా, శివ రాజ్, మహేష్, జ్యోతి, నాగలక్ష్మి, సులోచన, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ ఉద్యోగులు , ఇతర జేఏసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జల్ జీవన్ మిషన్ కింద త్రాగునీటి సరఫరా పనులను రెండు నెలల్లో వేగవంతంగా పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ - జల్ జీవన్ మిషన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి త్రాగునీరు అందించాలి. - రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత




అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 03 నేటి శుభోదయ : అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం రాప్తాడు నియోజకవర్గంలో త్రాగునీటి సరఫరా కోసం చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులపై ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్ఈ, అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లో చేపట్టిన పనుల పురోగతి, ఎంతవరకు పనులు పూర్తయ్యాయి, ఎక్కడెక్కడ పనులు చేపట్టాలి, తదితర అంశాలపై ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వీలైనంత త్వరగా గ్రామాలకు త్రాగునీరు అందించాలన్నారు. జల జీవన్ పథకం కింద అనంతపురము రూరల్ మండలంలో సాయి పావని కంపెనీ 40 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించగా, ఇప్పటివరకు రూ.18 కోట్ల పనులు చేశారని, అందులో ఇప్పటివరకు 15 కోట్ల 50 లక్షల రూపాయల బిల్స్ ఇచ్చారని, 2 కోట్ల 50 లక్షలు బిల్స్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందులో ఇంకా 22 కోట్ల రూపాయల పనులు చేయాలన్నారు. ఆత్మకూరు మండలంలో సరస్వతి కంపెనీ 50 కోట్ల 43 లక్షల రూపాయలతో పనులు ప్రారంభించగా, రూ.38 కోట్ల పనులు చేశారని, వారికి 34 కోట్ల బిల్స్ ఇచ్చారని, ఇంకా 12 కోట్ల 43 లక్షల రూపాయల పనులు చేయాలన్నారు. వారు ఆత్మకూరులో 10 గ్రామాలు, అనంతపురము రూరల్ పరిధిలో 4 గ్రామాలు, రాప్తాడులో 6 గ్రామాలలో పనులు చేస్తున్నారని, 50 శాతం పనులు చేసి మిగిలిన పనులు కాంట్రాక్టర్ పూర్తి చేయలేదన్నారు. సాయి పావని కాంట్రాక్టర్ వారు 31 గ్రామాలలో (కక్కలపల్లి కాలనీ, పాపంపేట, సజ్జల కాలువ, చిన్నంపల్లి, ఆలమూరు, కాటిగానికాలువ, రాచానపల్లి, ఎస్ కె యూనివర్సిటీ చుట్టూ గ్రామాలు వీటితో పాటు 19 గ్రామాలు) పనులు చేస్తున్నారని, ఇందులో 50 శాతం పనులు చేశారని, మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. త్రాగునీటి సమస్యలు లేకుండా చిన్న చిన్న రిపేర్ ఏమైనా ఉంటే వెంటనే పరిష్కరించి గ్రామాలకు నీటి సరఫరా చేయాలని సూచించారు. పీఏబీఆర్ డ్యాం దగ్గర మెయిన్ పైప్ లైన్ 600 మీటర్లు పెండింగ్ లో ఉందన్నారు. పీఏబీఆర్ డ్యాం దగ్గర ఫిల్టర్ బెడ్స్ పనులు ఇప్పటివరకు మొదలు కాలేదని, డ్యాం దగ్గర క్లియర్ వాటర్ సంపు నుండి ఆత్మకూరుకు పంపింగ్ చేసే మోటర్లు ఇప్పటివరకు ఆర్డర్ పెట్టలేదని, పి.నారాయణపురం, పి.యాలేరు మధ్య హెచ్.ఎన్.ఎస్.ఎస్ కెనాల్ బ్రిడ్జి పనులు పూర్తికాలేదని, 50 శాతం పనులు జరిగాయని, ఆత్మకూరు గ్రామంలో ఓ.హెచ్.ఎస్.ఆర్ ట్యాంక్ పనులు సంపు పనులు ఇంకా పూర్తి కాలేదని, పంపురూము మరియు మోటర్లు పనులు కూడా పూర్తి కాలేదని, పంపనూరు , చిన్నంపల్లి దగ్గర కట్టాల్సిన మినీ ట్యాంకుల పనులు కూడా పూర్తి కాలేదని, సత్యసాయి కార్మికులు జీతాలు రావట్లేదని, జీతాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. త్రాగునీటి సరఫరా పనులు వేగవంతంగా చేపట్టినందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద త్రాగునీటి సరఫరా పనులను రెండు నెలల్లో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్.నినో విపత్కర పరిస్థితుల్లో జల్ జీవన్ మిషన్ పనులను రెండు నెలలలోగా వేగవంతంగా పూర్తి చేసి 30 గ్రామాలకు త్రాగునీరు అందించాలని ఆదేశించారు. మౌలిక వసతుల పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రధానంగా పంపింగ్ హౌస్ వద్ద 60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పంపింగ్ హౌస్ వద్ద కొత్త సాండ్ ఫిల్టర్లను అమర్చేందుకు చర్యలు చేపట్టాలని, దీనికి సంబంధించిన ఆర్డర్లను వెంటనే పూర్తి చేసి, రాబోయే 2 నెలల్లో పనులను చేపట్టాలనే లక్ష్యంగా పెట్టుకుని పూర్తి చేయాలన్నారు. సబ్‌కాంట్రాక్టర్ ద్వారా కిర్లోస్కర్ కంపెనీ పంప్ సెట్ల కోసం ఆర్డర్ ప్రక్రియ వేగవంతం చేయాలని, రాబోయే 3-4 రోజుల్లో పేమెంట్లు పూర్తి చేసి, అధికారికంగా ఆర్డర్ ఖరారు చేయాలన్నారు. సాండ్ ఫిల్టర్లు, పైప్‌లైన్ల డయామీటర్ పెంపు మరియు ఇతర సాంకేతిక మార్పులకు సంబంధించిన రివైజ్డ్ వర్కింగ్ ఎస్టిమేట్లకు వారంలోగా ఎస్ఈ / సీఈ స్థాయి అధికారుల నుండి ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కురుగుంట సిండికేట్ నగర్ పరిధిలోని మిగిలి ఉన్న 350 మీటర్ల చొప్పున పైప్‌లైన్ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇబ్బందులు ఏవైనా ఉంటే స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారుల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలన్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున, పిఏఆర్‌బి డ్యామ్ నుండే మనకు ప్రధాన నీటి సరఫరా ఆధారపడి ఉందన్నారు. ప్రతినెల ఈ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రజలకు త్రాగునీటి ఎద్దడి కలగకుండా ఈ పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడమే ప్రాథమిక లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ పనులకు సంబంధించి పీఏబిఆర్ దగ్గర 2.5 ఎకరాల భూమి కావలసి ఉండగా, అందులో 75 సెంట్లు ఇవ్వడం జరగగా, ఇంకా 1.75 ఎకరాలు ఇవ్వాల్సి ఉండగా, వెంటనే త్వరగా ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దానితో పాటు ఒడ్డుపల్లి సబ్ స్టేషన్ వెనుకాల పిపిటి కట్టేందుకు 10 సెంట్లు కావలసి ఉండగా వెంటనే ఇవ్వాలని రెవెన్యూ అధికారులని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, రాప్తాడు డిఈ శ్రీధర్, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# పరిశుభ్రత, ప్రజారోగ్య ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు



విజయవాడ, సెప్టెంబర్ 3 (నేటి శుభోదయ):విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలోని 27, 37వ డివిజన్ల పరిధిలో మటన్, చికెన్ షాపులు, హోటళ్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 27వ డివిజన్ పరిధిలోని దుర్గాపురం ప్రాంతంలో మటన్, చికెన్ షాపులను అధికారులు తనిఖీ చేసి, షాపుల్లో మాంసం నిల్వ, విక్రయ విధానం, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మాంసాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేసి విక్రయించాలని, మాంస వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడవేయకుండా సక్రమంగా తొలగించాలని షాపుల యాజమాన్యాలకు సూచించారు. మాంసం వ్యర్థాల కారణంగా దుర్వాసన, ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, షాపుల వద్ద అపరిశుభ్ర పరిస్థితులు ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ప్రజారోగ్యానికి విఘాతం కలిగించే విధంగా నిబంధనలను ఉల్లంఘిస్తే సంబంధిత షాపులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా 37వ డివిజన్ పరిధిలోని కాళేశ్వరరావు మార్కెట్, తారాపేట, కెనాల్ రోడ్డు, మెయిన్ బజార్ ప్రాంతాల్లోని పలు హోటళ్లను అధికారులు తనిఖీ చేశారు. తారాపేటలోని ఫౌండ్రీ కరిముల్లా బిర్యానీ పాయింట్, మెయిన్ బజార్‌లోని హోటల్ పంచవటి తదితర హోటళ్లను తనిఖీ చేయగా, కిచెన్ గదులకు టైల్స్ లేకపోవడం, గోడలు, ఇతర ప్రదేశాల్లో బూజు ఏర్పడి ఉండటం, అపరిశుభ్రమైన వాతావరణం నెలకొని ఉండటం వంటి లోపాలను గుర్తించారు. అలాగే నాణ్యమైన తాగునీటిని వినియోగించకపోవడం, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, పరిశుభ్రత ప్రమాణాలను పాటించకుండా అపరిశుభ్ర వాతావరణంలో ఆహార తయారీ, వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం వంటి లోపాలను అధికారులు గుర్తించారు. ప్రజారోగ్యానికి విఘాతం కలిగించే విధంగా అపరిశుభ్ర పరిస్థితుల్లో హోటల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నందుకు సంబంధిత రెండు హోటళ్లకు ఒక్కొక్కదానికి రూ.5,000 చొప్పున జరిమానా విధించి నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న హోటల్ యాజమాన్యాలు నిర్ణీత గడువులోగా గుర్తించిన లోపాలను పూర్తిస్థాయిలో సరిదిద్దుకోవాలని, పరిశుభ్రత, ఆహార భద్రత మరియు ప్రజారోగ్య నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు ఆదేశించారు. నిర్ణీత గడువులోగా లోపాలను సరిచేయని పక్షంలో చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టడంతో పాటు, అవసరమైతే ట్రేడ్ లైసెన్సులు రద్దు చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటళ్లు, మటన్, చికెన్ షాపుల యాజమాన్యాలు ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన ఆహారం, మాంసాన్ని ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణంలో అందించాలని అధికారులు సూచించారు. నగరంలో ప్రజారోగ్యం, పారిశుద్ధ్య ప్రమాణాల పరిరక్షణకు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో శానిటరీ సూపర్‌వైజర్లు సలీం అహ్మద్, డి. సోమరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్లు బి. యోగేంద్ర కుమార్, ఎం. రవిశంకర్, ప్రజారోగ్య విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కమిషనర్ ధ్యానచంద్రను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్



విజయవాడ, సెప్టెంబర్ 3 (నేటి శుభోదయ): విజయవాడ నగరపాలక సంస్థకు నూతనంగా చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్‌గా నియమితులైన డాక్టర్ నిర్మల గౌరీ గురువారం ఉదయం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ ధ్యానచంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర డాక్టర్ నిర్మల గౌరీకి శుభాకాంక్షలు తెలియజేసి, నగర ప్రజలకు మెరుగైన వైద్య, ప్రజారోగ్య సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# పెంచిన రొయ్యల మేతల ధరలు వెంటనే తగ్గించాలి

## - ఆక్వా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి - ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్




ఏలూరు, సెప్టెంబర్ 3, నేటి శుభోదయ : పెంచిన రొయ్యల మేతల ధరలు వెంటనే తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ఏలూరు అన్నే భవనంలో ఆక్వా రైతుల సమస్యలు – పెంచిన ఫీడ్ ధరలు అంశంపై నిర్వహించిన సమావేశానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఆక్వా ఫీడ్ తయారీ కంపెనీలు వెనామి రొయ్యల మేత ధర కిలోకు రూ.9, టైగర్ రొయ్యల మేత కిలోకు రూ.12 పెంచి వేయడం దారుణమని విమర్శించారు. పెంచిన ఫీడ్ ధరల వలన ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగి ఆక్వా రైతులు మరింత నష్టాల్లోకి కూరుకుపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలతో వెనామీ ఫీడ్ ధర కిలోకు రూ. 105, టైగర్ రొయ్య మేత ధర కిలోకు రూ.120 ఖర్చు అవుతుందని, కిలో రొయ్యలు ఉత్పత్తికి రూ.300 ఖర్చు అవుతున్నదని, ఉత్పత్తి ఖర్చు కూడా రైతుకు రావడం లేదన్నారు. ఒకవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు, మరోవైపు యుద్ధాలు కారణంగా ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విద్యుత్ సబ్సిడీ కూడా ఆక్వా రైతులందరికీ పూర్తిగా అందడం లేదన్నారు. ఆక్వా ఫీడ్ తయారీ కంపెనీలు సిండికేట్ గా మారి ఏకపక్షంగా ఫీడ్ ధరలు పెంచుతున్నా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని పెంచిన ధరలు తగ్గించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆక్వా రైతుల వలన వేల కోట్ల రూపాయలు ప్రభుత్వాలకు ఆదాయాలు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వాలు ఆక్వా రైతుల సమస్యలను పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. పెంచిన ఫీడ్ ధరలకు వ్యతిరేకంగా ఆక్వా రైతులు చేస్తున్న పోరాటానికి రైతు సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని చెప్పారు. ఆక్వా రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అనేక విద్యార్హతలు.. ఒకే విశ్వవిద్యాలయంతో సుదీర్ఘ అనుబంధం

## –డాక్టర్ రవికుమార్ బొప్పనకు ఘన సత్కారం




గుంటూరు, సెప్టెంబర్ 3: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పర్యాటక, ఆతిథ్య నిర్వహణ విభాగంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు హాజరై తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి డాక్టర్ రవికుమార్ బొప్పనను విభాగాధిపతి ప్రొఫెసర్ పి. పూర్ణచంద్రరావు, సీనియర్ అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. డాక్టర్ రవికుమార్ బొప్పనకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంతో సుదీర్ఘమైన విద్యా అనుబంధం ఉంది. ఇదే విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆయన పలు ఉన్నత విద్యా కోర్సులను పూర్తి చేశారు. పర్యాటక, ప్రయాణ నిర్వహణలో ఎంబీఏ, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్‌లో ఎంఏ, వ్యవసాయ ఆర్థిక శాస్త్రం, గ్రామీణాభివృద్ధిలో ఎంకామ్ తో పాటు అనుబంధ సిద్ధార్థ లా కళాశాల నుండి బీఎల్ అభ్యసించారు. సహకార నిర్వహణలో ఉన్నత డిప్లొమాను సైతం పొందారు. అంతేకాకుండా విశ్వవిద్యాలయంలోని వాణిజ్య, వ్యాపార నిర్వహణ విభాగం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 'సామాజిక మాధ్యమాల నిర్వహణ వ్యూహాలు -- సంప్రదాయ మాధ్యమాలపై వాటి ప్రభావం -- ఒక విశ్లేషణ' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల్లో విద్యను అభ్యసించిన డాక్టర్ రవికుమార్ బొప్పనకు ఈ సంస్థతో ప్రత్యేక అనుబంధం ఉంది. విద్యార్థిగా తాను గడిపిన విశ్వవిద్యాలయ ప్రాంగణానికి పూర్వ విద్యార్థిగా తిరిగి రావడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం – ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే

## – మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే కేసులే కంభంపాడులో ట్రాఫిక్ కట్టడికి పోలీసుల నిఘా

## – అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేతకు చెక్ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ కట్టుదిట్టం



( నేటి శుభోదయ న్యూస్) ప్రతినిధి ఎ కొండూర్ సెప్టెంబర్ 3 ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు కంభంపాడు: ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఏ.కొండూరు ఎస్ఐ గంధం మహాలక్ష్మడు అన్నారు. కంభంపాడు గ్రామ పరిధిలో ఏ.కొండూరు పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ కార్యక్రమం బుధవారం,నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గంధం మహాలక్ష్మణుడు,మాట్లాడుతూ రహదారులపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు ఆటో డ్రైవర్లు, తోపుడు బండ్ల నిర్వాహకులు, స్వీట్ షాపుల యజమానులు, రహదారి పక్కన వ్యాపారాలు నిర్వహించే వారు ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దుకాణాల ముందు వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపి ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు వాహనదారులు హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం, వేగ నియంత్రణ పాటించడం వంటి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై ఈ–చలాన్లు విధించడంతో పాటు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు మద్యం సేవించివాహనాలునడపొద్దు యువత మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని ఎస్ఐ మహాలక్ష్మడు హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు జరిమానా, జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని చెప్పారురహదారులపై నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, ట్రాఫిక్కు అడ్డంకులు కలిగించడం వంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణతో పాటు ప్రజలకు సురక్షితమైన ప్రయాణం కల్పించేందుకు గ్రామంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలను కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ గంధం మహాలక్ష్మడు కోరారు.

# శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ నందు ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



( నేటిశుభోదయ న్యూస్ )ప్రతినిధి తిరువూరు: సెప్టెంబర్ 3 ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని తోటమూల గ్రామంలో గల శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ నందు గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా పాఠశాల సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ అంజనబాబు,డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ చందు ఆదేశాల మేరకు విద్యార్థులు సాంప్రదాయ దుస్తులలో పాఠశాలకు హాజరై ఉట్టి కొట్టడం జరిగింది అనంతరం విద్యార్థులతో వారు మాట్లాడుతూ శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతం గురించి క్లుప్తంగా వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే

- మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే కేసులే కంభంపాడులో ట్రాఫిక్ కట్టడికి పోలీసుల నిఘా
- అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేతకు చెక్ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ కట్టుదిట్టం



( నేటి శుభోదయ న్యూస్) ప్రతినిధి ఎ కొండూర్ సెప్టెంబర్ 3 ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు కంభంపాడు: ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఏ.కొండూరు ఎస్ఐ గంధం మహాలక్ష్మడు అన్నారు. కంభంపాడు గ్రామ పరిధిలో ఏ.కొండూరు పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ కార్యక్రమం బుధవారం,నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గంధం మహాలక్ష్మణుడు,మాట్లాడుతూ రహదారులపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు ఆటో డ్రైవర్లు, తోపుడు బండ్ల నిర్వాహకులు, స్వీట్ షాపుల యజమానులు, రహదారి పక్కన వ్యాపారాలు నిర్వహించే వారు ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దుకాణాల ముందు వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపి ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు వాహనదారులు హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం, వేగ నియంత్రణ పాటించడం వంటి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై ఈ–చలాన్లు విధించడంతో పాటు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు మద్యం సేవించివాహనాలునడపొద్దు యువత మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని ఎస్ఐ మహాలక్ష్మడు హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు జరిమానా, జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని చెప్పారురహదారులపై నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, ట్రాఫిక్కు అడ్డంకులు కలిగించడం వంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణతో పాటు ప్రజలకు సురక్షితమైన ప్రయాణం కల్పించేందుకు గ్రామంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలను కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ గంధం మహాలక్ష్మడు కోరారు.

# 42 లక్షలతో గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన

- భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ అంబికా
- ఎమ్మెల్యే కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపిన నారాయణపురం వాసులు
- ఎల్. నినో నేపథ్యంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్న ఎంపీ అంబికా





అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 03 నేటి శుభోదయ :అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో నారాయణపురంలో నూతన ఆసుపత్రి నిర్మాణం కాబోతోంది. ప్రధాన్ మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ పథకం కింద 42 లక్షలతో గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కూడా పాల్గొన్నారు. ముందుగా నారాయణపురం వాసులు, టిడిపి నాయకులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఘన స్వాగతం పలికారు. భూమి పూజ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ నారాయణపురం ప్రాంతంలో నారాయణపురం ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరుకొని ఇక్కడ సిబ్బంది, వైద్యులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారన్నారు. ఏ అవసరం వచ్చినా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఈ సమస్యకు తాము పరిష్కారం చూపించామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కృషితో ఈ ఆసుపత్రిని నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తవుతుందన్నారు. రెండేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. అందుకే ఇంటింటికి కూటమి ప్రభుత్వం పేరుతో ప్రజల్లోకి వెళ్లి తాము చేసిన వాటిని వివరించామన్నారు. ఇప్పటికే అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 80 వేల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచి కార్యక్రమాలను వివరించామన్నారు. అనంతపురం జిల్లా వంటి వెనుకబడిన ప్రాంతానికి లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయన్నారు. అదేవిధంగా అదే స్థాయిలో ఉద్యోగాలు కల్పన కూడా జరుగుతోందన్నారు. స్త్రీ శక్తి, తల్లికి వందనం, పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేశామన్నారు. దీనిపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 1296 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. 250కోట్ల రూపాయలతో రోడ్ల, డ్రైనేజీలు వంటి మాలిక వసతులు కూడా కల్పించామన్నారు. త్వరలోనే 160 కోట్లతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తామని చెప్పారు. మరోవైపు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంతపురం జిల్లా పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టితో అనేక కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఎల్.నినో ప్రభావంతో మన రాష్ట్రంలోనే కాకుండా పక్క రాష్ట్రంలోనూ, ఇతర దేశాల్లో కూడా తీవ్రమైన నీటి సమస్య వచ్చిందన్నారు. మరో ఏడాది పాటు ఈ సమస్య ఉంటుందని అంచనా వేసి ముందే స్పష్టమైన ప్రణాళికతో నీటిని సద్వినియోగం చేసుకునే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ ఏడాది వర్షాలు లేని కారణంగా ప్రజలు ఎవరు ఇబ్బంది పడకుండా తాగునీటిని ముందే తగినంతగా నిల్వ చేసుకుంటున్నట్లు చెప్పారు. రైతులెవరు వరి, మిర్చి లాంటి పంటలు వేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలంతా ప్రభుత్వానికి సహకరించాలన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. నారాయణపురంలో ఆసుపత్రి తీసుకొచ్చి ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేలా చేశారని ఎంపీ అంబికా అన్నారు. ఈ కార్యక్రమంలో డిష్ నాగరాజు, రఘునాథ్, జయప్రకాష్, కదిరప్ప, వెంకటలక్ష్మి, అశ్విని, అక్షిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# సూర్యలంక నగరవనాన్ని సందర్శించిన ఏపీ గ్రీన్ సొసైటీ ఛైర్మన్ ఎమ్మెల్సీ నాగబాబు

## ఘన స్వాగతం పలికిన విన్నకోట సురేష్



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) :సెప్టెంబర్ 3 అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అపూర్వ ఆతిథ్యం, శాలువాతో సత్కారం పార్టీ కార్యక్రమాలను ప్రతి ఊరూ, వాడకూ తీసుకెళ్లాలని పిలుపు పర్యావరణ పరిరక్షణే ధ్యేయం: నగరవనం అభివృద్ధి, హరిత వాతావరణంపై ప్రత్యేక సమీక్ష. బాపట్ల జిల్లా లో పర్యావరణ పరిరక్షణ రాజకీయ ఉత్సాహం ఒకే వేదికపై ఆవిష్కృతమయ్యాయి. ఏపీ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు బాపట్ల పర్యటన నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బాపట్ల రూరల్ పరిధిలోని ప్రసిద్ధ సూర్యలంక తీర ప్రాంతానికి సమీపంలో ఉన్న నగరవనాన్ని సందర్శించేందుకు విచ్చేసిన ఆయనకు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ ప్రముఖ నాయకులు విన్నకోట సురేష్ ఘనంగా స్వాగతం పలికారు. సూర్యలంక నగరవనానికి విచ్చేసిన కొణిదెల నాగబాబుకు జనసేన నాయకులు విన్నకోట సురేష్ పుష్పగుచ్ఛం అందజేసి ఆప్యాయంగా స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంగా నగరవనం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, తీర ప్రాంతంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు గ్రీన్ సొసైటీ ద్వారా అమలు చేయాల్సిన ప్రణాళికలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ పర్యాటకులను ఆకర్షించేలా నగరవనాన్ని తీర్చిదిద్దాలని నాగబాబు అభిలషించారు. ఈ పర్యటన కేవలం అధికారిక కార్యక్రమంగానే కాకుండా, రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. నగరవనం సందర్శనంతరం ఎమ్మెల్సీ నాగబాబు, జనసేన నాయకులు విన్నకోట సురేష్తో కలిసి బాపట్ల నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై ప్రత్యేకంగా మంతనాలు జరిపారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. బాపట్ల నియోజకవర్గంలో జనసేన పార్టీ మూలాలు మరింత గట్టిపడేలా శ్రేణులు అంకితభావంతో శ్రమించాలని పిలుపునిచ్చారు. పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ, సేవా కార్యక్రమాలను ప్రతి ఊరూ, వాడకూ విస్తృతంగా తీసుకువెళ్లి ప్రజలకు చేరువ కావాలని స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై విన్నకోట సురేష్తో చర్చించిన నాగబాబు.. ప్రభుత్వ పరంగా, గ్రీన్ సొసైటీ పరంగా అందవలసిన సహకారాన్ని అందిస్తామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని నాయకులకు ఘనంగా అభివాదం తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ, పార్టీ శ్రేణులలో నూతనోత్సాహాన్ని నింపిన ఈ పర్యటన బాపట్ల రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తించింది.

# శివయ్య ఆస్తులకు శ్రీరక్ష

ప్రొద్దుటూరు సెప్టెంబర్ 3: శ్రీ అగస్తీశ్వర స్వామి దేవస్థానం భూములను ఆక్రమణల నుంచి కాపాడి,తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి తెలిపారు. కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని భూములకు ప్రభుత్వ సర్వేయర్తో కొలతలు వేయించామని,కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు,కాలువల మళ్లింపు,ప్లాట్ల ఏర్పాటు జరిగినట్లు గుర్తించామని చెప్పారు. త్వరలో హద్దులు ఏర్పాటు చేసి ఎండోమెంట్స్ నిబంధనల మేరకు కౌలుకు బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 7న ఆలయంలో నూతన యాగశాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఉదయం పాశుపత క్షీరాభిషేకం,వరుణ హోమాలు,మధ్యాహ్నం అన్నప్రసాదం,సాయంత్రం మహిళల కోలాట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## మాదిగలకు ఎంపీ లావు క్షమాపణ చెప్పాలి: ఎమ్మార్పీఎస్ డిమాండ్



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 3; నేటి శుభోదయ : నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు మాదిగ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక క్రిస్టియన్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, గత నెల 27వ తేదీన చిలకలూరిపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు 32 గంటల పాటు జాతీయ రహదారిపై దిగ్బంధనం నిర్వహించామని తెలిపారు. ఈ ఘటనపై ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చేసిన వ్యాఖ్యలను వారు తప్పుబట్టారు. ఇలాంటి కార్యక్రమాలకు రాజకీయ నిరుద్యోగులు పాల్పడతారని ఎంపీ వ్యాఖ్యానించారని, ఈ వ్యాఖ్యలు మాదిగ సమాజాన్ని అవమానించే విధంగా ఉన్నాయని ఆరోపించారు. దీనిపై ఎంపీ వెంటనే మాదిగలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాదిగల మద్దతుతోనే రాజకీయంగా ఎదిగిన విషయాన్ని ఎంపీ గుర్తుంచుకోవాలని నాయకులు పేర్కొన్నారు. గతంలో ఎమ్మార్పీఎస్ జెండాను పట్టుకొని ప్రచారం చేసిన విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. చిలకలూరిపేట ప్రమాద బాధిత కుటుంబాలకు మందకృష్ణ మాదిగ స్వయంగా వెళ్లి సంఘీభావం తెలిపి, ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పొలం, ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని తెలిపారు. ఈ డిమాండ్ అనంతరమే ముఖ్యమంత్రి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారని పేర్కొన్నారు. తాము ముందుగానే బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఉంటే రోడ్డు దిగ్బంధనం చేపట్టాల్సిన అవసరం వచ్చేది కాదని వారు అన్నారు. ఇప్పటికైనా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాదిగలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు.

## ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కన్నాకు ఘన సన్మానం



తాడిపత్రి, సెప్టెంబర్ 03 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) అనంతపురం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సీనియర్ జర్నలిస్ట్ కన్నాకు స్థానిక కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. స్థానిక భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నేతలు ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్ట్ కన్నా ఎల్లప్పుడూ కార్మికుల సమస్యలపై పోరాడుతూ, వారి కష్టాలను వెలుగులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా పలువురు కార్మిక నేతలు కొనియాడారు. నిజాయితీ, నిబద్ధతతో పనిచేసే ఆయనకు ఈ పదవి దక్కడం అభినందనీయమని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం టౌన్ అధ్యక్షుడు వెంకట్, రాష్ట్ర కార్పెంటర్ సంఘం గౌరవాధ్యక్షులు బి. నబి రసూల్, బేల్దారు అసోసియేషన్ అధ్యక్షులు గంగయ్య, ఉపాధ్యక్షులు కె. నాగరాజు, ట్రెజరర్ పరిమిశెట్టి రంగనాయకులు, సెక్రెటరీ నారాయణ, జాయింట్ సెక్రెటరీ వెంకటరమణ, పెయింటర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఫైజుల్, సెక్రెటరీ హైదర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## తండాలకు మహర్దశ.. రూ.3 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

- గిరిజన తండాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట
- రూ.3 కోట్ల ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం
- నిధులు మంజూరు చేసిన మంత్రి గుమ్మడి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సవిత



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 03 నేటి శుభోదయ : పెనుకొండ నియోజకవర్గంలోని అన్ని గిరిజన తండాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి ఎస్. సవిత తెలిపారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా నియోజకవర్గంలోని అన్ని తండాల్లో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.3 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మడి సంధ్యారాణిని సచివాలయంలో మంత్రి సవిత మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పెనుకొండ మండలంలోని మక్కాజపల్లి, కొండంపల్లి, గోనిపెంట తండాలతో పాటు గోరంట్ల మండలంలోని బీఎన్ తండా, కొమ్మలతండా, బూచేపల్లి తండా, భీమ్లా నాయక్ తండా, గంగంపల్లి తండా, దాసరిపల్లి తండా, మిషన్ తండాతో పాటు పెనుకొండ నియోజకవర్గంలోని అన్ని గిరిజన తండాల్లో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులను వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు. తండాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగడంతో పాటు పారిశుధ్యం మెరుగుపడుతుందని మంత్రి సవిత పేర్కొన్నారు. గిరిజన తండాల్లో నివసించే ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. పెనుకొండ నియోజకవర్గంలోని అన్ని గిరిజన తండాల సమగ్ర అభివృద్ధికి రూ.3 కోట్ల ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేసిన మంత్రి గుమ్మడి సంధ్యారాణికి మంత్రి సవిత ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా నియోజకవర్గంలోని అన్ని తండాల అభివృద్ధికి అవసరమైన మరిన్ని నిధులు తీసుకువచ్చి మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని మంత్రి సవిత స్పష్టం చేశారు.

## రెడ్డిగూడెం మండలంలో రూ.7.9 కోట్లతో మూడు ప్రధాన రహదారుల అభివృద్ధికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



విజయవాడ, సెప్టెంబర్ 3 (నేటి శుభోదయ): మైలవరం నియోజకవర్గంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణ ప్రసాదు పేర్కొన్నారు. రెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాల్లో మొత్తం రూ.7.9 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు ప్రధాన రహదారుల అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపనలు చేశారు. రూ.2.2 కోట్ల అంచనా వ్యయంతో విజయవాడ--విస్సన్నపేట ప్రధాన రహదారి నుంచి నరుకుళ్లపాడు వరకు చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు తాటిగూడెం వద్ద ఎమ్మెల్యే కృష్ణప్రసాదు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.3.3 కోట్ల అంచనా వ్యయంతో విజయవాడ–విస్సన్నపేట రహదారి నుంచి అన్నేరావుపేట వరకు నిర్మించనున్న రహదారి అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపన చేశారు. మరోవైపు రూ.2.4 కోట్ల అంచనా వ్యయంతో ఎం.ఎన్.కె. రోడ్డు నుంచి మాధవరం వరకు వయా కూనపరాజుపర్వ మీదుగా చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆయా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉన్న గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించడం ద్వారా ఆయా గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. రహదారుల అభివృద్ధితో వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడంతో పాటు, అత్యవసర సమయాల్లో రాకపోకలు సులభతరం కానున్నాయి. ఎప్పటినుంచో పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న రహదారి సమస్యలకు ఎమ్మెల్యే చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించి, పనులకు శంకుస్థాపన చేయడం పట్ల స్థానిక ప్రజలు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## శ్రీపురం చెరువులో పశుగ్రాసం సాగుకు శ్రీకారం

**-కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా పశుసంవర్ధక అధికారి ప్రేమ్ చంద్, తదితరులు**





అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 03 : నేటి శుభోదయ : గుత్తి మండలం శ్రీపురం ( కొజ్జేపల్లి) గ్రామ చెరువులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సూపర్ ఎల్.నినో పరిస్థితుల్లో చెరువు గర్భంలో పశు గ్రాసం సాగు ప్రక్రియను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా పశుసంవర్ధక అధికారి ప్రేమ్ చంద్, తదితరులు పాల్గొన్నారు. కొద్దిగా కురిసిన వర్షాలకు చెరువు గర్భంలో ఉన్న తేమను ఉపయోగించుకొని పశుగ్రాసం అద్భుతంగా పండుతుందనే ఉద్దేశంతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

శ్రీపురం చెరువు గర్భంలో 25 ఎకరాల్లో పశుగ్రాసం సాగు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ సూపర్ ఎల్.నినో పరిస్థితుల్లో చెరువు గర్భంలో పశు గ్రాసం సాగు ఎంతో ముఖ్యమైనదన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 297 ఎకరాల్లో పశుగ్రాస సాగుకు అనుమతి ఇవ్వగా, ఇప్పటివరకు 249 ఎకరాల్లో విత్తనాలు చల్లడం పూర్తయిందని, మిగిలిన విస్తీర్ణంలో కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. పశుగ్రాసం సాగు వల్ల పశువులకు ఆహారం అందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో ఘనజీవామృతం, బీజామృతం ద్వారా విత్తనాలను శుద్ధి చేసి నాటుకున్నట్లయితే, చిన్న చినుకులకు కూడా మొలక వస్తుందని, తదనంతరం భూమి గర్భంలో ఉండే తేమను ఉపయోగించుకొని ఈ కార్యక్రమం విజయవంతం అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక అధికారి ప్రేమ్ చంద్ మాట్లాడుతూ పశుగ్రాసం విత్తుకోవడానికి మరియు దున్నుకోవడానికి ఆర్డీటీ సంస్థ వారు ఎకరానికి 3,000 రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. పశుసంవర్ధక శాఖ తరఫున ప్రతి ఎకరానికి 1,840 రూపాయల విలువ చేసే 20 కేజీల ఉచిత విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. ఇక్కడి చెరువులో 25 ఎకరాల్లో పండే పశుగ్రాసం ద్వారా రాబోయే 6 నెలల పాటు సుమారు 200 పశువులకు సరిపడా గ్రాసాన్ని అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, పశు సంవర్ధక శాఖ డిడి రమేష్ రెడ్డి, తహసీల్దార్ పుణ్యవతి, పశుసంవర్ధక శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బెజవాడ మంజులకు ఘన సన్మానం






గుడివాడ, సెప్టెంబర్ 3: శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం కమిటీ సభ్యురాలిగా బెజవాడ మంజులను నియమించి, ప్రమాణ స్వీకారం చేయించిన సందర్భంగా టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు లంకపల్లి లాజరు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లంకపల్లి లాజరు మాట్లాడుతూ మంచి మనసుతో, సేవా భావంతో పనిచేస్తున్న బెజవాడ మంజులకు మరింతగా ప్రజాసేవ చేసే అవకాశం కల్పించిన గౌరవ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టీడీపీ అధ్యక్షుడు పంద్రాజు సాంబశివరావు, జనసేన గుడివాడ అధ్యక్షుడు బూరగడ్డ శ్రీకాంత్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ ప్రత్యక్ష నేత లింగం ప్రసాద్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -“APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,“D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

# "కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటా వైసిపి ఇన్చార్జి వడ్డీ రఘురాం నాయుడు"

పెంటపాడు సెప్టెంబర్ 3 (నేటి– శుభోదయ) పెంటపాడు మండల వైసీపీ విస్తృతస్థాయి సమావేశం పెంటపాడు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గురువారం జరిగింది. ఈ సమావేశానికి పెంటపాడు వైసిపి మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాడేపల్లిగూడెం వైసీపీ ఇన్చార్జ్ వడ్డీ రఘురామనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వడ్డీ మాట్లాడుతూ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని మిమ్మల్ని కాపాడుకునే బాధ్యత నేను తీసుకుంటానని కూటమి ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లతో గద్దెనెక్కి పేదలను మోసం చేసిందని ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆయన అన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని త్వరలో ఇంటికి సాగనంపే రోజులు దగ్గరలో ఉన్నాయని ఆయన అన్నారు. ఏ ఒక్క హామీ కూడా అమలు చేయకుండా మోసం చేసింది అన్నారు. కూటమి ప్రభుత్వం వైసిపి వాళ్ళు ఏదైనా చేస్తే భూతద్దంలో చూపించి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా వాళ్ళ చేసిన హడావుడి ఇంత అంత కాదని ప్రజలను భయభ్రాంతులను గురిచేసారని సామాన్యుడు రోడ్డు మీద కూడా తిరగకుండా చేశారని ఆయన అన్నారు. వెలుగొండ ప్రాజెక్టు స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి టైంలో 90% పూర్తి చేస్తే మిగతా వర్కు ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం పూర్తిచేసి హడావుడి చేస్తున్నారని ఆయన అన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో జడ్పిటిసి, ఎంపిటిసి, పంచాయతీలు సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు ప్రతి ఒక్కరు పోటీ చేసి తీరాలని ఎక్కడ కూడా ఏకగ్రీవం అవటానికి వీలులేదని ఆయన అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ఎవరు ఎంత ప్రలోభాలు పెట్టిన ఎవరు భయపడక్కర్లేదని పోటీలో ఉండవలసిందేనని ఆయన కార్యకర్తలకు గట్టిగా చెప్పారు. మీమీ గ్రామాలలో కూర్చుని గ్రూపు రాజకీయాలు లేకుండా ఒక మాటపై అందరూ కలిసికట్టుగా ఒక నాయకుడుని నిలబెట్టి అతను విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఆయన తెలిపారు ఏమైనా ఇబ్బంది ఉంటే ముందుగా మండల ప్రెసిడెంట్ కైగాల శ్రీనివాస్ కు తెలియజేయాలని అక్కడ కూడా సమస్య పరిష్కారం కాకపోతే తన దృష్టికి తీసుకురావాలని వడ్డీ అన్నారు. గెలుపే దిశగా ప్రతి కార్యకర్త అహర్నిశ్రమలు నిద్రపోకుండా విజయానికి కృషి చేయాలని గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు మాట్లాడుతూ కూటమి



ప్రభుత్వం పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని మన నాయకులందరూ కూడా ఒక మాట మీద ఉండి వారి వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని మన నాయకులు కొంతమంది కూటమి ప్రభుత్వ నాయకులతో రాత్రులు టచింగ్ లో ఉంటున్నారని అటువంటి పద్ధతులు మానుకోవాలని వైసిపి ప్రభుత్వం రావడానికి కృషి చేయాలని దీనిని మనం సవాల్ గా తీసుకోవాలని ఆయన తెలిపారు. గ్రామ పార్టీ అధ్యక్షులు బర్ల జయ రాంబాబు మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడ గ్రూపు రాజకీయాలు లేకుండా అందరూ ఒకటే బాట మీద నడవాలని మండలం లో ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు గెలుపుకి విశేషంగా కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు గొర్రెల శ్రీనివాస్, పెంటపాడు గ్రామ మాజీ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్ రెడ్డి, నల్లిమిల్లి విజయ నంద రెడ్డి, గుండుబోగుల బలుసులు, వీర్ల గోవింద్, సంపత్ రావు కృష్ణారావు, మారంపూడి ఏసుదాస్, కొలుపూరి శివ కిరణ్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కర్రీ పృథ్వి కుమార్ రెడ్డి, కర్రీ శివారెడ్డి, నల్లిమిల్లి అప్పిరెడ్డి, ద్వారంపూడి కిరణ్ కుమార్ రెడ్డి, అడ్వకేట్ అద్దంకి విజయరత్నం, వీర్ల వెంకటేష్, మారంపూడి రవికుమార్, ఉండ్రాజు వరపు రాజు, చదలవాడ శ్రీనివాస్, తానేటికుమార్ రాజా, మొఖమట్ల శ్రీనివాస్ అలజంగి చిట్టిబాబు మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ వార్డు మెంబర్లు, మాజీ ఎంపీటీసీలు బూతు లెవెల్ ఏజెంట్లు మరియు అధిక సంఖ్యలో వివిధ గ్రామాలను వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఏ యస్ పి. హేమంత్



చింతూరు, సెప్టెంబర్ 3, నేటి శుభోదయ : డిజిటల్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఏ ఎస్ పి హేమంత్ నిమ్మలగూడెం గ్రామంలో జరిగిన అవగాహన సదస్సులో పేర్కొన్నారు. అలాగే మహిళల భద్రత మనందరి బాధ్యత అని చింతూరు సిఐ గోపాలకృష్ణ పేర్కొన్నారు. తుమ్మల గ్రామం లో గురువారం మహిళల భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మొబైల్లో వచ్చే మెసేజ్ మోసాల పట్ల, అప్రమత్తంగా ఉండాలని ఎ యస్ పి పేర్కొన్నారు.పోలీసువున్నతాధికారులైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మొబైల్ వాడకం పెరిగిన కొద్ది మోసాలు పెరుగుతున్నాయని మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు.మహిళలను, విద్యార్థినులను ఎవరైనా ఈవ్ టీజింగ్ చేస్తే 112 నెంబర్ కు కాల్ చేయాలన్నారు. మహిళల భద్రత గూర్చి మాట్లాడుతూ కొంతమంది మోసగాళ్లు మొబైల్ ద్వారా మహిళలను ట్రాప్ చేసి మోసగిస్తారని మొబైల్ తో అప్రమత్తంగా ఉండాలని అలాంటివారు ఎవరైనా మహిళలను అల్లరి పెడితే తమ దృష్టికి తేవాలన్నారు. విద్యార్థినులు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. .మొబైల్ వాడకం పెరుగడం వల్ల మోసాలు కూడా అంతే స్థాయి లో పెరుగు తున్నాయన్నారు.మొబైల్ లో డిజిటల్ అరెస్ట్ చేశామని మొబైల్ వాడకం దారులకు అక్రమ కాల్స్ వస్తుంటాయని, అలాంటి అరెస్టులు ఏమి ఉండవని, ఆ విధమైన కాల్స్ వస్తే వెంటనే తమకు తెలపాలని కోరారు. అలాగే యువతను ఉద్దేశించి చెడు వ్యసనాలపై అవగాహన కల్పించారు. బహిరంగంగా మద్యం సేవించడం కూడా నేరమేనన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచి బహిరంగంగా మద్యం సేవించే వారిని కనుగొని కేసులు పెడతామని, వదిలిపెట్టేది లేదని, అలాగే అతివేగంగా వాహనాలు నడపటం, లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు నలుగురు కూర్చోని ప్రయాణించటం నేరం అన్నారు. వాహన యజమానులు తమ మైనర్ బాల బాలికలకు వాహనాలు నడపటానికి ఇవ్వకూడదని, అలా ఇవ్వడం నేరమని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామని పేర్కొన్నారు .గంజాయి సేవించడం, అక్రమ రవాణా చేయటం, అక్రమ రవాణా చేసే వారికి సహకరించటం నేరమేనని, జైలు జీవితం గడపాల్సి వస్తుందని, గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులు ఎవరికన్నా ఉంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పేర్కొన్నారు.. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు తమ గ్రామాలకు వస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.అలాగే రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని యువత, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల లో ఏ యస్ పి, సి ఐ లతో పాటు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న బల్లా పల్లవి

అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 03 నేటి శుభోదయ : పవిత్ర గురువారం సందర్భంగా శ్రీవారి మెట్టు ఎక్కి, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి దర్శించుకున్నారు. శ్రీవారి మెట్లు ఎక్కి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ఆమె దేవుణ్ణి వేడుకున్నారు. రాష్ట్రంలో వర్షాలు బాగా కురవాలని రైతులు, ప్రజలు బాగా ఉండాలని కోరుకున్నారు. ఆమె వెంట అనంతపురం టిడిపి నియోజకవర్గ అధ్యక్షురాలు మాజీ కార్పొరేటర్ విజయశ్రీ రెడ్డి తదితరులు ఉన్నారు



# మహిళల భద్రత మనందరి బాధ్యత : సి ఐ



చింతూరు, సెప్టెంబర్ 3, నేటి శుభోదయ : మహిళల భద్రత మనందరి బాధ్యత అని చింతూరు సిఐ గోపాలకృష్ణ పేర్కొన్నారు. తుమ్మల గ్రామం లో గురువారం మహిళల భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మొబైల్లో వచ్చే మెసేజ్ మోసాల పట్ల, అప్రమత్తంగా ఉండాలని ఎ యస్ పి పేర్కొన్నారు. పోలీసువున్నతాధికారులైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ఏ ఎస్ పి బోర్డు హేమంత్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. .మొబైల్ వాడకం పెరిగిన కొద్ది మోసాలు పెరుగుతున్నాయని మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు.మహిళలను, విద్యార్థినులను ఎవరైనా ఈవ్ టీజింగ్ చేస్తే 112 నెంబర్ కు కాల్ చేయాలన్నారు. మహిళల భద్రత గూర్చి మాట్లాడుతూ కొంతమంది మోసగాళ్లు మొబైల్ ద్వారా మహిళలను ట్రాప్ చేసి మోసగిస్తారని మొబైల్ తో అప్రమత్తంగా ఉండాలని అలాంటివారు ఎవరైనా మహిళలను అల్లరి పెడితే తమ దృష్టికి తేవాలన్నారు. విద్యార్థినులు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. .మొబైల్ వాడకం పెరుగడం వల్ల మోసాలు కూడా అంతే స్థాయి లో పెరుగు తున్నాయన్నారు.మొబైల్ లో డిజిటల్ అరెస్ట్ చేశామని మొబైల్ వాడకం దారులకు అక్రమ కాల్స్ వస్తుంటాయని, అలాంటి అరెస్టులు ఏమి ఉండవని, ఆ విధమైన కాల్స్ వస్తే వెంటనే తమకు తెలపాలని కోరారు. అలాగే యువతను ఉద్దేశించి చెడు వ్యసనాలపై అవగాహన కల్పించారు. బహిరంగంగా మద్యం సేవించడం కూడా నేరమేనన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచి బహిరంగంగా మద్యం సేవించే వారిని కనుగొని కేసులు పెడతామని, వదిలిపెట్టేది లేదని, అలాగే అతివేగంగా వాహనాలు నడపటం, లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు నలుగురు కూర్చోని ప్రయాణించటం నేరం అన్నారు. వాహన యజమానులు తమ మైనర్ బాల బాలికలకు వాహనాలు నడపటానికి ఇవ్వకూడదని, అలా ఇవ్వడం నేరమని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామని పేర్కొన్నారు.

# అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలి

## – కమర్తపు మురళి గ్లోబల్ ప్రచారం మానుకోవాలి
## – మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్




ఖమ్మం, సెప్టెంబర్ 3, నేటి శుభోదయ : ఖమ్మం నగరం 36వ డివిజన్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై కాంగ్రెస్ నాయకులు కమర్తపు అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఇప్పటికైనా త్రీ టౌన్ పై అతను చేస్తున్న గ్లోబల్ ప్రచారం గత కొద్దిరోజులుగా కమర్థపు మురళి పొట్టి శ్రీరామ రోడ్డు, డివిజన్ అభివృద్ధిపై చేసిన వ్యాఖ్యలకు మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ స్పందించారు. తమ డివిజన్ పరిధిలో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల పరిస్థితి అధ్వానంగా ఉందని ఆయన ఆరోపించారు. పొట్టి శ్రీరామ రోడ్డు విస్తరణ కోసం కమిషనర్ను కలిసి స్థానికులను ఒప్పించింది నేను శివాలయం దగ్గర నుండి హర్కార బావి దాదాపుగా 180 ఇల్లు అందరితో మాట్లాడి దాదాపుగా 78 డాక్యుమెంట్లు కమిషనర్ కి అందజేయడం జరిగింది. తరువాత అధికారులు వచ్చి రోడ్డు విస్తరణకు కొలతలు వేశారని తెలిపారు. ఆ తర్వాత వారి స్వార్థం కోసం అక్కడ ఉన్న అధికార పార్టీ నాయకుడు రెండుసార్లు వాళ్లతో మీటింగ్ పెట్టి వారిని పక్కదోవ పట్టించి వారి వెనక ఉండి ఇంటికి ఐదు వేల రూపాయలు తీసుకొని కాలువలు ధ్వంసం చేశారు . కార్పొరేషన్ కాలవల్ని ఎలా ఎలా ప్రైవేట్ వ్యక్తులు ధ్వంసం చేస్తారు అని ఆరోజు పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వడం కూడా జరిగింది . మా డివిజన్లోని అన్ని ప్రాంతాల్లో ప్రాంతంలోని కాలువలు మున్సిపాలిటీకి సంబంధించినవేనని, ప్రైవేటు వ్యక్తులు వాటిని ఆక్రమిస్తే చర్యలు తీసుకోవాలని కోరారు. స్మార్ట్ డ్రైనేజీ పేరుతో ఏడాది క్రితం శిలాఫలకం ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటి వరకు పనులు ముందుకు సాగలేదన్నారు. 2025 ఆగస్టు 14న మంత్రి శంకుస్థాపన చేసిన కాలువ పనులు కూడా పూర్తికాలేదని, రైల్వే శాఖ నుంచి రూ.2 కోట్ల నిధులు వచ్చినా ఫలితం కనిపించడం లేదని విమర్శించారు. బ్రహ్మంగారి గుడి సమీపంలోని రోడ్డు పరిస్థితి, ఆంధ్రా బ్యాంకు నుంచి వైన్ షాపు వరకు రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాల లేమిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీధి దీపాల కోసం పలుమార్లు కోరినా స్పందన లేదని, 60 స్తంభాల ఏర్పాటుకు కమిషనర్కు లేఖ ఇచ్చినా ఎస్టిమేట్ దశలోనే పనులు నిలిచిపోయాయని తెలిపారు.

**వరద సాయం అందలేదని ఆరోపణ**

ఎస్పార్క్, పీసీకే తోట ప్రాంతాల్లో మధ్యతరగతి కుటుంబాలు అధికంగా నివసిస్తున్నాయని, వరద సాయం కోసం 168 మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఒక్క చెక్కు కూడా రాలేదని రామ్మోహన్ ఆరోపించారు.గతంలో మంత్రి అజయ్‌కుమార్ హయాంలో గాంధీచౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం మీదుగా నయాబజార్ వరకు యూడీఎఫ్ నిధులతో రోడ్డు అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. అలాగే మా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో 23 లక్షల లీటర్ల సామర్థ్యం ఖమ్మం లో బాహుబలీ వాటర్ ట్యాంక్ నిర్మాణం జరిగిందన్నారు. పిల్లి చిన్నట్టు తోట, పీసీకే తోట ప్రాంతాల్లో రూ.90 లక్షలతో రోడ్లు, కాలువల పనులకు అనుమతులు తీసుకొచ్చినట్లు తెలిపారు.

**వ్యక్తిగత విమర్శలు సరికాదు :**మురళి వ్యాఖ్యలపై స్పందిస్తూ ముందుగా డివిజన్ పరిస్థితి, గతంలో జరిగిన అభివృద్ధి గురించి తెలుసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రి పక్కన ఉండి రెండుసార్లు పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన వారు ఇప్పుడు అభివృద్ధిపై మాట్లాడటం సరికాదన్నారు. పార్టీ పరంగా ఎవరికి ఏ అభిప్రాయం ఉన్నా అభ్యంతరం లేదని, అయితే వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన విధంగా స్పందిస్తానని హెచ్చరించారు. గాంధీచౌక్ ఖమ్మం నగరానికి గుండెకాయ వంటిదని, అలాంటి ప్రధాన ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు ఉండటం బాధాకరమన్నారు. తమ ప్రాంత ప్రజలు చీకట్లో జీవిస్తున్నారని, కనీసం వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా అభివృద్ధి జరిగిందని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. మైనారిటీ సోదరులు తమ స్థలాలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని చెప్పినప్పుడు వారిని కూర్చోబెట్టి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వెనుక దాబాల బజార్ రోడ్డులోని వాసవి గార్డెన్ నుంచి ముందున్న ప్రాంతం వరకు సరైన రోడ్డు, తారు, వీధి దీపాలు లేవని తెలిపారు.

**ఇందిరమ్మ చీరల పంపిణీపై ఫిర్యాదు :**ఇతర డివిజన్లలో ఇందిరమ్మ చీరల పంపిణీ జరుగుతున్నప్పటికీ తమ డివిజన్‌లో నిలిపివేయడంతో గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. జూబ్లీ క్లబ్‌లో చీరలను నిల్వ ఉంచిన విషయం ఫొటోలతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే యూనిట్ ప్రారంభించి పంపిణీ చేయాలని ఆదేశించినట్లు మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ తెలిపారు.